

ఎర్రవల్లిలో గురువారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి, ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ, నర్సాపూర్, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు

# మీరు లేక ఆగమవుతున్నం

మొదటిపేజీ తరువాయి...

అడుగులేస్తూ ముందుకు సాగిన మహారాష్ట్ర తదితర రాష్ట్రాల ప్రజలు మొన్నటి తెలంగాణ ఎన్నికల ఫలితాలతో తీవ్ర ఆవేదన చెందారని తెలిపారు. కేసీఆర్ పాలన లేకపోవడం వల్ల తెలంగాణ రైతుల కంటే మహారాష్ట్రతోపాటు దేశ రైతాంగమే తీవ్రంగా నష్టపోయిందని ఇటీవల తనను కలిసిన మహారాష్ట్ర నేతలు అన్నారని గుర్తుచేసుకున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమితో రైతు రాజ్యాన్ని అందించగల దమ్మున్న కేసీఆర్ దార్శనిక నాయకత్వాన్ని దేశం కోల్పోయిందని వారు బాధపడ్డారని తెలిపారు.

### ప్రజా తీర్పే శిరోధార్యం

నల్ల చట్టాలను తెచ్చి తమ జీవితాలను, తాము నమ్ముకున్న వ్యవసాయ రంగాన్ని ఆగం చేయాలని చూసిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో దేశ రైతాంగం శాంతియుత పోరాటం చేసిన సంగతిని కేసీఆర్ గుర్తుచేశారు. రైతులపై లాఠీచార్జీ చేసి, కాల్పులు జరిపి 700 మంది రైతుల మరణానికి నాటి బీజేపీ ప్రభుత్వం కారణమైందని ఆరోపించారు. దేశ రైతాంగ బాధలను తీర్చేందుకు నడుం కట్టిన బీఆర్ఎస్ పార్టీ 'కిసాన్ సర్కార్' నినాదంతో మహారాష్ట్ర నుంచి ఒక లైన్ తీసుకొని ముందుకు సాగిందని వివరించారు. ఈ క్రమంలో మహారాష్ట్ర ప్రజల నుంచి అపూర్వస్పందన వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణతో పాటు దేశ రైతాంగ ప్రగతి కోసం బయలుదేరిన నేపథ్యంలో తెలంగాణ ప్రజల నిర్ణయం ఇతర రాష్ట్రాల రైతాంగాన్ని నిరుత్సాహపరిచిందని తెలిపారు. అయినా ఏమాత్రం ఆధైర్యపడొద్దని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయమని స్పష్టం చేశారు. "ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు.. ప్రతిపక్ష పాత్ర కూడా శాశ్వతం కాదు. మనకు ప్రజాతీర్పే శిరోధార్యం. వారు ఎటువంటి పాత్ర

బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడుతున్న కేసీఆర్

అప్పగిస్తే దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి. అధికారం కోల్పోయామని బాధపడడం రాజకీయ నాయకుడి లక్షణం కాదు. ప్రజాసంక్షేమం కోసం కొనసాగే నిరంతర ప్రక్రియే రాజకీయం. దానికి గెలుపు ఓటములతో సంబంధం ఉండదు. ప్రజల్లో కలిసి ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి అభిమానాన్ని సాధించాలి" అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన సాగు, తాగునీరు, నిరంతర విద్యుత్తు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సీఎంఆర్ఎఫ్ వంటి అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకపోవడంతో తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణ సంపూర్ణ అభివృద్ధి సాధించడమే పార్టీ అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. గెలుపోటములకు అతీతంగా నిరంతర కృషి కొనసాగించడమే మన కర్తవ్యమని కార్యకర్తలకు ఉద్బోధించారు. కార్యక్రమంలో ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే అశన్నగారి జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కవులు, రచయితలు ప్రజల్లో చైతన్యం నింపాలి

### ఉమ్మడి పాలనలో తెలంగాణ నాయకత్వ నిర్లక్ష్య ధోరణితోనే తీవ్ర నష్టం: కేసీఆర్

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నదీజలాల వాటాను సాధించుకోవటంలో ఉమ్మడి రాష్ట్రంలో నాటి ఆంధ్రా నాయకుల స్వార్థంతోపాటు, తెలంగాణ నాయకత్వం అనుసరించిన నిర్లక్ష్య ధోరణి, సోయిలేనితనమే ప్రధాన కారణాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ఫలితంగా తెలంగాణ రైతాంగానికి దశాబ్దాల పాటు నష్టం వాటిల్లిందని చెప్పారు. గురువారం ఎర్రవల్లిలోని తన నివాసంలో కేసీఆర్‌ను ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మర్యాదపూర్వంగా కలిశారు. తన సాహితీ సృజనను కేసీఆర్‌కు అందజేశారు. అనంతరం సాగిన ఇష్టాగోష్టిలో తెలంగాణ సాహిత్యం, సంస్కృతి, రాజకీయాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ విద్యుత్తు, వ్యవసాయ రంగంలో తెలంగాణకు ఉద్దేశపూరిత ద్రోహాలను పసిగట్టడంలో నాటి తెలంగాణ నాయకత్వ చైతన్యరాహిత్యం రైతాంగానికి తీరని శాపంగా మారిందని వెల్లడించారు. అలాంటి సంక్లిష్ట పరిస్థితిలోంచి తెలంగాణ సమస్యలను అర్థం చేసుకొని కవులు, కళాకారులు, మేధావుల సాహిత్య సాంస్కృతిక ప్రక్రియ ఒకవైపు, బీఆర్ఎస్ రాజకీయ ప్రక్రియ మరోవైపు జమిలిగా సాగి భావజాల వ్యాప్తి చేస్తూ ప్రజలకు అర్థం చేయించి ఉద్యమాన్ని నడిపించి తెలంగాణ సాధించగలిగామని వివరించారు. గత నష్టాలను సరిదిద్దుకుంటూ తెలంగాణ అస్థిత్వ గరిమను నిలుపుకుంటూ దేశానికే ఆదర్శవంతమైన ప్రగతిని అందించామని తెలిపారు.

### ప్రపంచానికే ఆదర్శం: గోరటి వెంకన్న

ప్రపంచ నాయకత్వానికి దీటుగా శాంతియుత పద్ధతిలో కేసీఆర్ ఉద్యమ ప్రస్థానం సాగిందని గోరటి వెంకన్న అన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలన దేశానికే ఆదర్శంగా సాగిందని చెప్పారు. గోరటి వెంకన్నతోపాటు సీనియర్ జర్నలిస్టు వర్రెల్లి వెంకన్న తన 'పిట్టవాలిన చెట్టు' పుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేశారు. జర్నలిస్టు వెంకన్నను కేసీఆర్ అభినందించారు. ఇష్టాగోష్టిలో ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, శేరి సుభాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పార్టీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమాచారం లేకుండా రావద్దు

ముందస్తు సమాచారం లేకుండా తనను కలిసేందుకు రావొద్దని, వచ్చే ముందు సమాచారం లేదా అనుమతి తీసుకోవాలని ఎర్రవెల్లి వస్తున్న అభిమానులు, కార్యకర్తలకు కేసీఆర్ మరోమారు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గాల పేర్లను పార్టీ ముందస్తుగా ప్రకటిస్తుందని, అలా ప్రకటించిన ప్రాంతాల వారే తమ స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసుకుంటూ తనను కలవడానికి రావాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఎంత చెప్పినా వినకుండా ఎర్రవెల్లి నివాసానికి వచ్చి ఇబ్బందులు పడొద్దని స్పష్టం చేశారు.

## డిసెంబర్‌లోనే గ్రూప్2, 3 నిర్వహించాలి

- రెండింటిలో పోస్టుల సంఖ్యను పెంచాలి
- నిరుద్యోగ చైతన్యయాత్ర కోఆర్డినేటర్ల డిమాండ్
- హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఆందోళన

చిక్కడపల్లి, జూలై4: గ్రూప్ 2, 3 పోస్టుల సంఖ్యను పెంచాలి. ఆయా పరీక్షలను డిసెంబర్ నెలలో నిర్వహించాలని పలువురు నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ చైతన్యయాత్ర చేపట్టిన నిరుద్యోగ నేతల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో ఆందోళన నిర్వహించారు. ఆ యాత్ర కో ఆర్డినేటర్లు మఠం శివానందస్వామి, ఇంద్ర ప్రసాద్‌నాయక్ మాట్లాడుతూ తాము నిరుద్యోగ చైతన్యయాత్ర పేరిట రాష్ట్రవ్యాప్తంగా రెండు బస్సుల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కీలకపాత్ర పోషించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఒక్కో పరీక్షకు వ్యవధి ఉండేలా షెడ్యూల్ మార్చాలన్న తమ వినతి మేరకు నాడు కాంగ్రెస్ నేతగా రేవంత్‌రెడ్డి కూడా అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారని తెలిపారు. నేడు ఆయనే సీఎంగా ఉండి ఇప్పుడు డీఎస్సీసీ, గ్రూప్-2 పరీక్షలకు ఒక్క రోజే గడువు ఇచ్చారని విమర్శించారు. నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగులు మహేశ్, ఈశ్వర్, యుగందర్, సలీం, ప్రేమ్‌కుమార్, నరేశ్, అభినవ్, కాంత్రికుమార్, శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నేతలను ముందస్తుగా అరెస్టు చేసిన అచ్చంపేట పోలీసులు

# నేడు నిరుద్యోగుల మార్చ్

మొదటిపేజీ తరువాయి...

కదం తొక్కుతున్నారు. నిరుద్యోగుల మార్చ్, టీజీపీఎస్సీ ముట్టడి కార్యక్రమాలలో పాల్గొనడానికి నిరుద్యోగులు స్వచ్ఛందంగా తరలిరావడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. పైడిమాండ్లతో పాటు డిసెంబర్‌లో గ్రూపు 2,3 పరీక్షలు నిర్వహించాలని, నిరుద్యోగ భృతి కింద రూ.4 వేలు ఇవ్వాలని, గురుకుల టీచర్ పోస్టుల భర్తీలో రిలింక్విష్‌మెంట్ విధానం అమలుచేయాని జేఏసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం దిగొచ్చేదాకా వెనుకడుగు వేసేదే లేదంటూ హెచ్చరిస్తున్నారు. కార్యక్రమంపై సోషల్ మీడియా వేదికల్లో వేలాది పోస్టులు దర్శనమిస్తున్నాయి.

### ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతు

నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేంత వరకు వారి పక్షాన నిలబడి, ఉద్యమానికి బాసటగా నిలుస్తామని ప్రతిపక్షాలు ప్రకటించాయి. ఇప్పటికే నిరుద్యోగుల ఉద్యమానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇతర రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు మద్దతు ఇచ్చాయి.

### కొనసాగుతున్న ఆమరణ దీక్షలు, నిరసనలు

ఉద్యోగాల సాధన కోసం నిరుద్యోగులు నిత్యం ఉద్యమాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఓయూతో పాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో కూడా నిరుద్యోగుల నిరసనలు, శాంతియుత ర్యాలీలు కొనసాగుతున్నాయి. జిల్లాల వారీగా ప్రజా గ్రంథాలయాల్లో ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు, ప్రభుత్వ నినాదాలు జోరందుకున్నాయి. కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్, ఫ్యాకల్టీ అశోక్ తమ ఇండ్లలోనే ఆమరణ నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు.

### నిరుద్యోగుల అక్రమ అరెస్టులు

ఉద్యోగాల భర్తీ కోసం టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నిరుద్యోగులను గురువారం నుంచే పోలీసులు అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. ముట్టడిని అడ్డుకోవాలని చూస్తున్నారు. వివిధ విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నేతలను ముందస్తు అరెస్టు చేస్తున్నారు. ఇప్పటికే భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపహాడ్‌లో సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్ బాణావత్ హుస్సేన్‌నాయక్‌ను పోలీసు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. టీజీపీఎస్సీ ముట్టడి నేపథ్యంలోనే ఈ అరెస్టు చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో, ఉస్మానియా తదితర వర్సిటీలు, గ్రంథాలయాలు, స్టడీ సర్కిళ్లు, స్టడీ రూమ్‌లతోపాటు అనేక ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ నేతలను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేసి నిర్బంధంలో పెట్టినట్టు తెలుస్తున్నది.

## విద్యార్థినేతల అరెస్టు

### నిరుద్యోగుల ఇండ్లపై నిఘా

### అనుమానితుల కట్టడి

వినాయక్‌నగర్, జూలై 4/కరీంనగర్ తెలంగాణచౌక్/అచ్చంపేట రూరల్/బూర్గంపాడు/వనపర్తి/కాశీబుగ్గ: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వ హించే నిరుద్యోగ మార్చ్‌ను విఫలం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నట్టు సమాచారం. నిరుద్యోగ యువతను ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నది. వారిండ్లపై పోలీసులు నిఘా పెట్టారు. వాహనాలు అందుబాటులో లేకుండా ఆంక్షలు విధిస్తున్నది. నిజామాబాద్ జిల్లాలో పలువురు విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డిని గురువారం రాత్రి కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, కార్యదర్శి యుగేందర్‌నూ అదుపులోకి తీసుకొని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన విద్యార్థి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హాజీపూర్ చౌరస్తాలో సిద్దాపూర్ పోలీసులు అరెస్టు చేసి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సేవాలాల్‌సేన రాష్ట్ర కో కన్వీనర్ హుస్సేన్‌నాయక్ సహా మరో 20 మందిని ముందస్తు అరెస్టు చేశారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లికి చెందిన అర్జున్, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన నగేశ్‌ను వనపర్తి పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. వరంగల్ జిల్లా ఇంతేజార్‌గంజ్ పోలీసులు గురువారం రాత్రి పలువురు బీజేవైఎం నేతలను అరెస్టు చేశారు.

# సీపీఎస్‌ను రద్దుచేయాల్సిందే

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి
- ఉద్యోగులకు 51% ఫిట్‌మెంట్ ఇవ్వాలి
- త్వరలోనే సమస్యల పరిష్కార సభలు
- ఆ తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- హక్కుల పరిరక్షణకు దేనికైనా సిద్ధం
- ఉద్యోగులపై దాడులను సహించేది లేదు
- అక్రమాస్తుల పేరిట ఏసీబీ కేసులు సరికాదు
- నగదురహిత వైద్యం అందించాలి
- ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ జగదీశ్వర్

### సీపీఎస్ రద్దుపై కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైంది?

రాష్ట్రంలోని 40శాతం ఉద్యోగులు సీపీఎస్ పరిధిలో ఉన్నారు. వీరికి జీవనభద్రత కరువైంది. పెన్షన్ హక్కులు పూర్తిగా హరించుకుపోయాయి. సీపీఎస్‌ను రద్దుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఆ దిశగా ఒక అడుగూ ముందుకు వేయలేదు. సీపీఎస్ రద్దుపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానించి కేంద్రానికి పంపాలి. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యభూమిక పోషించాలి. ఇదే అంశంపై జేఏసీ తరపున కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి విజ్ఞప్తి చేసినం. ఇప్పటి వరకు మరే ఉద్యోగం సంఘం కూడా సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరలేదని నిర్మలా సీతారామన్ మాతో అన్నారు. సీపీఎస్‌పైనా తాము కమిటీని వేశామని, రాష్ట్రాల సూచనలు తీసుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వెంటనే నిర్ణయం తీసుకొని కేంద్రానికి విన్నవించాలి.

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : 'కాంట్రిబ్యూటరీ పెన్షనరీ స్కీం (సీపీఎస్)ను రద్దుచేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టింది. కానీ ఈ దిశగా ఒక్క అడుగూ ముందుకుపడలేదు. కమిటీలు, కాలయాపన లేకుండా ప్రభుత్వం వెంటనే సీపీఎస్ రద్దుపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానించాలి. పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) నివేదికను త్వరగా తెప్పించుకుని, ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంట్ వర్తింపజేయాలి. అన్ని శాఖలవారికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలి. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి ఏ పోరాటాలకైనా సిద్ధం' అని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ప్రకటించారు. ఉద్యోగులపై కొంతకాలంగా అనేకదాడులు జరుగుతున్నాయని, రాజకీయ నాయకులు ఉద్యోగులపై దాడులు చేస్తే ఊరుకోబోమని స్పష్టంచేశారు. ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్‌గా ఇటీవలే నియమితులైన ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది, రాజకీయనాయకులను రక్షణ కల్పిస్తున్నది ఉద్యోగులేనని, ఈ ప్రభుత్వం ఉద్యోగుల మేలు కోరేదైతే ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు అభివృద్ధి ప్రదాతలని, అభివృద్ధిలో భాగమని, వారిపాత్ర, కృషిలేనిదే ఏ పథకం కూడా విజయవంతంకాదని చెప్పిన ఆయన, మరిన్ని విషయాలను ఇలా పంచుకున్నారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏం చేస్తారు?

కొత్త ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైంది. 90 రోజులు పాటు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కొత్త ప్రభుత్వానికి కొంత సమయమివ్వాలని మేం ఓపికపట్టినం. సమస్యల పరిష్కారం కోసం నాలుగైదు సార్లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినం. పరిష్కరిస్తామని సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డే హామీనిచ్చారు. చాలా సమస్యలు పరిష్కారం కాలేదు. కొన్ని హామీలు ఇంకా నెరవేర్చలేదు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎంప్లాయీస్ జేఏసీ పక్షాన రాబోయే పది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తాం. జిల్లాలవారీగా సమస్యల పరిష్కార సభలు నిర్వహిస్తాం. సీపీఎస్ రద్దు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మార్కెటింగ్ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఆ తర్వాత అన్ని సంఘాలతో చర్చించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం. కొందరు ఉద్యోగులపై అక్రమాస్తులు కలిగి ఉన్నారని దాడులు చేయడం, ఏసీబీ కేసులు పెట్టడం సమంజసం కాదు. దీన్ని మేం ఖండిస్తున్నాం.

### డీఏ విడుదలపై ఈసీ అనుమతినిచ్చిందికదా?

ఒకటో తేదీన జీతాలిస్తున్నా పెండింగ్ డీఏలు విడుదల చేయకపోవడంతో అందరిలోనూ అసంతృప్తి నెలకొన్నది. ధరల సూచీ ప్రకారం ఎప్పటికప్పుడు ప్రభుత్వమే విధిగా డీఏ విడుదలచేయాలి. ఎన్నికల సమయంలో ఒక డీఏ విడుదలకు ఎలక్షన్ కమిషన్ అనుమతినిచ్చింది. ఈ జూలైతో కలిపితే మొత్తం 5 డీఏలు ప్రభుత్వం ఉద్యోగులకు బాకీపడింది. దీనిపై ఉద్యోగుల్లో తీవ్ర అసహనం నెలకొంది. వీటిలో నాలుగు డీఏలను విడుదల చేయాలి. పెండింగ్ బిల్లులు సైతం విడుదల చేయాలి. జీపీఎఫ్ సహా భవిష్యనిధిపై అంక్షలు, పరిమితులను ప్రభుత్వం తొలగించాలి. మా విజ్ఞప్తుల కారణంగా లక్ష లోపున్న బిల్లులు చెల్లించారు. పెండింగ్ బిల్లులను ఎప్పటికప్పుడు ఇవ్వాలి. పీఆర్సీ నివేదికను త్వరగా తెప్పించుకొని, 51శాతం ఫిట్‌మెంట్ వర్తింపజేయాలి. అందరికీ 010 పద్దు ద్వారా వేతనాలివ్వాలి.

### తాజా బదిలీలపై మీ స్పందన ఏంటి?

సాధారణ బదిలీలు చేపట్టడం హర్షణీయమే కానీ, జీవో 317కు సంబంధించిన అనేక పెండింగ్ సమస్యలున్నాయి. పరస్పర, స్పౌజ్ బదిలీలు కోరుతున్నవారున్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా సాధారణ బదిలీలు చేపట్టడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొన్నది. ఇక ఎన్నికల సమయంలో పలు శాఖల ఉద్యోగులు, అధికారులను బదిలీచేశారు. వారిని ఇంకా వెనక్కి తేలేదు. ఎన్నికలు పూర్తికాగానే వెనక్కి తీసుకురావడం సంప్రదాయం. తక్షణమే వారిని సొంత స్థానాలకు బదిలీ చేయాలి. రిటైర్డ్ అయిన వారిని కొనసాగించడం దారుణం. దీనివల్ల ఉద్యోగుల పదోన్నతులపై ప్రభావం పడుతున్నది. 30 ఏండ్ల సర్వీసు దాటినా పదోన్నతులు లభించని పరిస్థితులున్నాయి. కాబట్టి రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపును ఎట్టి పరిస్థితుల్లో మేం ఒప్పుకోం.

### ఈహెచ్ఎస్ అమలవుతున్నదా?

రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్ల వైద్య చికిత్స కోసం గత ప్రభుత్వం ఈహెచ్ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీం) ట్రస్టు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు తలా రూ. 500 చొప్పున సమకూర్చేందుకు అప్పట్లో జీవో జారీచేసింది. సరిపోకపోతే మరికొంత సమకూర్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. బీమా సంస్థలు, ప్రైవేట్ దవాఖానలు సైతం ఈహెచ్ఎస్ అమలుకు ముందుకొచ్చాయి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం ఏటా రూ. 700 కోట్ల కంటే ఎక్కువ ఖర్చుచేస్తున్నది. దీంతో పోలిస్తే ఈహెచ్ఎస్‌తో భారం తక్కువ, ప్రయోజనాలెక్కువ. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ స్కీంను అమలుచేయాలి. ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డులిచ్చి నగదురహిత, అపరిమిత వైద్యం అందించాలి.

## లోకం పోకడ




## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| మెదక్ | 34.5°c | 23.8°c |
| నల్లగొండ | 34.5°c | 24.4°c |
| నిజామాబాద్ | 34.2°c | 26.1°c |
| రంగారెడ్డి | 34.0°c | 23.2°c |
| కరీంనగర్ | 34.0°c | 27.0°c |
| వరంగల్ | 34.0°c | 27.0°c |
| హైదరాబాద్ | 33.6°c | 25.2°c |
| ఆదిలాబాద్ | 33.0°c | 27.0°c |
| మహబూబ్‌నగర్ | 32.1°c | 24.5°c |
| ఖమ్మం | 32.0°c | 26.0°c |

## రానున్న ఐదు రోజులు వర్షాలు

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం నాటికి పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, ఆది, సోమవారాల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వెల్లడించింది. మరోవైపు గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా ముత్తారం-మహదేవ్‌పూర్‌లో 2.65 సెంటీమీటర్లు, ములుగు జిల్లా వాజీడులో 2.36 సెం.మీ, తాడ్వాయిలో 1.64 సెం.మీ, మంగపేటలో 2.36 సెం.మీ, కామరెడ్డి జిల్లా జుక్కల్‌లో 2.14 సెం.మీ, సంగారెడ్డి జిల్లా మగ్డూంపల్లిలో 1.91 సెం.మీ, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరులో 1.82 సెం.మీ, పెద్దపల్లి జిల్లా ఓదేలులో 1.76 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

## కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ కరవు: సబిత

హైదరాబాద్, జూలై 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, చిన్నారులు, మహిళలపై లైంగికదాడులు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్, ఎల్బీనగర్, బండ్లగూడ, కూకట్‌పల్లి, మియాపూర్‌లో ఇటీవల వరుసగా జరిగిన ఘటనలు మహిళలకు రక్షణ లేని పరిస్థితికి నిదర్శనమని పేర్కొన్నారు. వరుస ఘోరాలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పందించే తీరికలేదా? మహిళలు అంటే ఇంత చిన్న చూపా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలపై జరుగుతున్న లైంగికదాడులపై ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## లాయర్ల బీమా 6 లక్షలకు పెంపు

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ ) : రాష్ట్రంలోని న్యాయవాదుల జీవిత బీమాను రూ.4 లక్షల నుంచి 6 లక్షలకు పెంచినట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 6న కౌన్సిల్ సమావేశంలో అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్‌లోని సెక్షన్-16(2) ప్రకారం బీమా పెంపునకు నిర్ణయం తీసుకున్నట్లు గురువారం ఆయన వెల్లడించారు. జూలై 1 నుంచి పెంపు అమల్లోకి వస్తుందని చెప్పారు.

### ఎస్సీ వర్గీకరణ కోసం 7న హైదరాబాద్‌లో

## ఎమ్మార్పీఎస్ దీక్ష

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, జూలై 4: ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 7న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఎస్సీ వర్గీకరణ దీక్ష చేపట్టనున్నట్టు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. దీక్ష విజయవంతం కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను గురువారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్